ఎల్‌వోసీ అందజేత

కోహీర్, డిసెంబర్ 12: మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల లలిత అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు రూ.1.50లక్షల విలువైన ఎల్‌వోసీని గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు. అత్యవసర చికిత్స కోసం సీఎం సహాయ నిధి నుంచి తమకు రూ.1.50లక్షలు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

బొల్లారం, జిన్నారం డిసెంబర్ 12: జిన్నారం మండల కేంద్రంలోని పంచాయతీ ఆవరణలో నిజాంపేట్ పట్టణానికి చెందిన హోలిస్టిక్ దవాఖాన యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న రోగులకు వైద్య బృందం గుండె సంబంధిత, ఈసీజీ, బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దాదాపు 200 మంది రోగులు వైద్య సేవలు వినియోగించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నివాస్ మేనేజర్ లక్ష్మీనారాయణ, జయరాజ్, వీర నాయక్, సిబ్బంది, రోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

కోహీర్, డిసెంబర్ 12: మండలంలోని బిలాల్‌పూర్ గ్రామంలో గురువారం మల్లికార్జునస్వామి ఆలయంలో దేవతామూర్తుల విగ్రహాలను వైభవంగా ప్రతిష్ఠించారు. భ్రమరాంబ, మల్లికార్జునస్వామి, కేతమ్మ, శివలింగం, నందీశ్వరుడు, వినాయకుడి విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో మాజీ జడ్పీటీసీ నర్సింహులు, కార్యదర్శి శ్వేత, మాజీ సర్పంచ్ నర్సింహులు, మాజీ ఉప సర్పంచ్ శైలజానర్సంహులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యలపై గ్రీవెన్స్

బొల్లారం, డిసెంబర్ 12: బొల్లారం మున్సిపల్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సమస్యలపై డివిజన్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని మున్సిపల్ విద్యుత్ శాఖ ఏడీఈ మాధవరావు, ఏఈ రామకృష్ణారెడ్డి సంయుక్త ప్రకటనలో తెలిపారు. పారిశ్రామికవేత్తలు, వినియోగదారులు నేరుగా తమ సమస్యలను లిఖితపూర్వకంగా అందించాలని సూచించారు.

ఎస్టీ బాలికల గురుకులం తనిఖీ

రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో

సిర్గాపూర్, డిసెంబర్ 12: మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని ఎస్టీ బాలికల గురుకులాన్ని ఎంఈవో నాగారం శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శైలజతో సమావేశమై గురుకులం స్థితిగతులు, బాలికలకు కల్పించిన వసతులపై చర్చించారు. టెన్త్, ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని, చదువులో వెనుకబడిన బాలికలను గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పీడీ సంతోష్‌చారి ఉన్నారు.

ఘనంగా మల్లన్న జాతర

సిర్గాపూర్, డిసెంబర్ 12: మండల కేంద్రంలోని మల్లన్న ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం మైల బోనం తీశారు. అనంతరం మల్లన్నను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ నెల 17వ తేదీ వరకు ఉత్సవాలు ఇక్కడ జరుగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

బొల్లారం(జిన్నారం), డిసెంబర్ 12: జిన్నారం మండలంలోని ఖాజీపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా ఏర్పడిన జీఎంఆర్ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ దండే రమాకాంత్ బొల్లారం సీఐ రవీందర్ రెడ్డిని కోరారు. ఈమేరకు గురువారం ఫౌండేషన్ సభ్యులతో కలిసి సీఐకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీ ప్రజల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్సవాలకు వేళాయె

- దత్తాత్రేయ జయంతికి బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమం ముస్తాబు
- నేటి నుంచి ప్రత్యేక పూజలు

విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్న దత్తగిరి మహారాజ్ ఆశ్రమం

దత్తగిరి ఆశ్రమంలో సిద్ధమవుతున్న యజ్ఞ గుండాలు

ఝరాసంగం, డిసెంబర్ 12: మండలంలోని ప్రకృతి రమణీయత మధ్య వెలసి, ప్రశాంతతకు నిలయమైన బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో మార్గశిర పౌర్ణమి 15న దత్త జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. దత్త జయంతి సందర్భంగా ఆశ్రమ పీఠధిపతులు అవధూత గిరిమహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వర స్వామి ఆధ్వర్యంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో 21 గుండాలతో దత్త యజ్ఞాలు, లోక కల్యాణార్థం చండి హోమం మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆశ్రమ పీఠధిపతులు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలిరానున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆశ్రమ ఆవరణలో చలువ పందిళ్లు, తాగునీరు, భోజన వసతి కల్పించేందుకు దత్తగిరి మహారాజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తుల దర్శనాలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆశ్రమ ముఖద్వారంతోపాటు దత్తాత్రేయ మందిరం, ఆత్రేయ మహరుషి, జ్యోతిర్లింగాల మండపం, పంచవృక్షాలు, అనసూయ, రేణుకామాత, గోమందిరం, నవగ్రహాల ఆలయాలకు రంగులు వేసి విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆశ్రమం ముందున్న రోడ్డుకు ఇరువైపులా దుకాణాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, ఎస్ఐ నరేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించనున్నారు. మండల వైద్యాధికారిని డాక్టర్ రమ్య ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు.

క్షేత్రానికి ఇలా చేరుకోవాలి

హైదరాబాద్ వైపు నుంచి వచ్చే భక్తులు, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వచ్చే వారు జహీరాబాద్ చేరుకోవాలి. భక్తుల కోసం దత్త జయంతికి జహీరాబాద్ డిపో నుంచి బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమానికి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

ఎక్స్‌ఎల్‌ను ఢీకొట్టిన థార్.. దంపతులు మృతి

సంగ్యానాయక్, సంగీబాయి(ఫైల్)

కల్హేర్, డిసెంబర్ 12: టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై కృష్ణాపూర్ మీదుగా నారాయణఖేడ్ వైపు వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న జీపు ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన కల్హేర్ మండలం మెటల్‌కుంట తండా సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశం, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మల్లూరు తండాకు చెందిన దంపతులు విస్లవత్ సంగ్యానాయక్ (65) విస్లవత్ సంగీబాయి(55) ఉదయం పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం అదే వాహనంపై ఇద్దరూ నారాయణఖేడ్ ప్రాంతంలో శుభకార్యానికి బయలుదేరారు. ఈ క్రమంలో మెటల్‌కుంట తండా సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న మహీంద్ర థార్ ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటన స్థలానికి నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి చేరుకొని ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఎస్ఐని వివరాలు అడుగగా బాధితులు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు.

దర్గా దర్శనానికి వచ్చి మృత్యుఒడికి..

జహీరాబాద్, డిసెంబర్ 12: ప్రతి ఏడాది దర్గాలను దర్శించి ఇంటికి తిరిగి వచ్చేవాడు. ఎప్పటిలాగే దర్గాను దర్శించుకునేందుకు వచ్చిన హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి న్యాల్‌కల్ మండలంలోని హుస్సేనగర్ శివారులోని మంజీర నదిలో శవమై తేలాడు. హద్నూర్ ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. హైదరాబాద్ పట్టణంలోని అసిఫ్‌నగర్‌లోని నటరాజ్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఇబ్రం (72) అప్పుడప్పుడు తెలిసిన ప్రాంతాల్లోని దర్గాలకు వెళ్లి వస్తుండేవాడు. ఎప్పటిలాగానే ఈ నెల 7న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాత్రికి ఆయన ఇంటికి రాలేదు. నాలుగు రోజులుగా ఆయన కోసం కుటుంబ సభ్యులు ఎదరు చూశారు. గురువారం మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామ శివారులోని మంజీర నది తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహన్ని గ్రామ రైతు వామన్‌రావు గుర్తించారు. వెంటనే కొందరిని అక్కడికి పిలిచి నదిలో నుంచి మృతదేహన్ని బయటకు తీసుకువచ్చారు. మృతుడి జేబులో లభించిన ఆసరా గుర్తింపు కార్డులోని ఫోన్ నంబర్‌కు రైతు వామన్‌రావు ఫోన్ చేసి వివరాలు తెలిపారు. ఆ హద్నూర్ పోలీసులకు సమాచారం అందించడంతో సిబ్బందితో ఎస్ఐ రాజశేఖర్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుని భార్య అబీదా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుమ్మడిదలలో చోరీ

గుమ్మడిదల,డిసెంబర్ 12: వరుస దొంగతనాలతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. బుధవారం రాత్రి గుమ్మడిదల మండల కేంద్రమైన పోచుగారి పాపిరెడి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గుమ్మడిదల గ్రామానికి చెందిన పోచుగారి పాపిరెడ్డి తన ఇల్లు బాగ లేకపోవడంతో సమీపంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఆ పాత ఇంటికి తాళం వేసి ఉండడంతో దొంగలు బుధవారం తలుపులు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. అల్మరాలో భద్రపరిచిన 8 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. నగలతో పాటు నగదు కూడా పోయిందని బాధితులు వాపోయారు. గురువారం ఉదయం పోచుగారి పాపిరెడ్డి తన పాత ఇంటిని చూసేసరికి తలుపులు తీసి ఉండడంతో లోపలికి వెళ్లి చూశారు. అక్కడి దృశ్యాన్ని చూసిన పాపిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని చూసేసరికి చోరీకి గురైనట్లు గ్రహించారు. గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై మహేశ్వర్‌రెడ్డి క్లూస్‌టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై మాట్లాడుతూ చోరీలు జరుగుతుండడంతో మండల ప్రజలు జాగ్రత వహించాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలసి సూచించారు.

మజ్దూర్ యూనియన్ జయకేతనం

దక్షిణ మధ్య రైల్వే గుర్తింపు ఎన్నికల్లో గెలుపు

జహీరాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో సంబురాలు జరుపుకుంటున్న యూనియన్ నాయకులు, ఉద్యోగులు

జహీరాబాద్, డిసెంబర్ 12: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ విజయం సాధించడంతో నాయకులు, కార్మికులు సంబురాలను జరుపుకున్నారు. గురువారం సికింద్రాబాద్ డివిజన్ రైల్వే కార్యాలయంలో జరిగిన గుర్తింపు సంఘాల ఎన్నికల ఫలితాలను ప్రకటించారు. ఈ ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ పోటీపడ్డాయి. 2633 ఓట్ల మెజార్టీతో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ విజయం సాధించింది. ఈ సందర్భంగా వికారాబాద్ బ్రాంచ్ చైర్మన్, జహీరాబాద్ రైల్వే స్టేషన్ మాస్టర్ మాధవకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జహీరాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో అధికారులు, యూనియన్ నాయకులు, కార్మికులు పటాకులు కాల్చారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకొని సంబురాలు జరుపుకున్నారు. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ కార్యదర్శి డాక్టర్ శంకర్‌రావు, డివిజన్ కార్యదర్శి రవీందర్, జోనల్ అధ్యక్షుడు కల్వ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు ఖాజబాబాల నాయకత్వంలో తమ యూనియన్ విజయసాధించడం సంతోషంగా ఉందని వికారాబాద్ బ్రాంచ్ చైర్మన్, జహీరాబాద్ రైల్వే స్టేషన్ మాస్టర్ మాధవ కృష్ణ అన్నారు.

మహాపడి పూజకు హాజరైన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ

గుమ్మడిదల, డిసెంబర్ 12: మండల కేంద్రంలో అయ్యప్పస్వామి దివ్య మహాపడిపూజ కనుల పండువగా సాగింది. గురువారం గుమ్మడిదలలోని కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామి దివ్య మహాపడి పూజను పురోహితులు కిరణ్‌శర్మ, గురుస్వాముల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈపూజకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి తదితర నాయకులు పాల్గొన్ని అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు పెద్దతల్లి యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఇప్పటికైనా నేరాలు మానండి

నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ వెంకట్‌రెడ్డి

సిర్గాపూర్, డిసెంబర్ 12: గతంలో చేసిన నేరాలు మళ్లీ పునరావృతం కాకుండా ఇప్పటికైనా సక్రమంగా నడుచుకోవాలని సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి గురువారం స్థానిక ఠాణాలో నేరస్తులకు సూచించారు. దొంగతనం కేసులో శిక్ష పడి బెయిల్‌పై బయటకు వచ్చిన వారికి ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. మండలంలోని బీబ్యాతండాకు చెందిన జయరాం, బలిరాం, పుండ్లిక్, నాగేశ్‌కు దొంగతనం కేసులో కోర్టు వీరికి శిక్ష విధించిందన్నారు. ఒక్కొక్కరిపై 35 కేసులు ఉన్నాయని, మళ్లీ నేరం చేస్తే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కొత్త చట్టాలు కఠినంగా ఉన్నాయని, నేరాలు చేసి జైలుకు వెళ్తే కుటుంబాలు వీధిన పడతాయని, ఇప్పటికైనా తప్పుడు పనులు మానాలని సూచించారు.

పాసింగ్ పరేడ్ వీక్షించిన కానుకుంట విద్యార్థులు

గుమ్మడిదల, డిసెంబర్ 12: వాయుసేనా అకాడమీ దుండిగల్‌లో నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌ను విద్యార్థులు తిలకించారు. గురువారం మండలంలోని అన్నారం పరిధిలోని వాయుసేనా అకాడమిలో జరిగిన పాసింగ్ పెరేడ్‌కు కానుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులు సైనికులు చేసిన రకరకాల విమానవిన్యాసాలు, పాసింగ్ పెరేడ్‌ను వీక్షించారు. ఇందులో ఉపాధ్యాయులు ఈశ్వర్, రమేశ్, అప్పిరెడ్డి, ప్రభాకర్ ఉపాధ్యాయుల పర్యవేక్షనలో విద్యార్థులు పాసింగ్ పరేడ్‌ను వీక్షించారు.

అధికారులొచ్చినా నాయకులు రాలే..!

జహీరాబాద్ ఎన్నికలపై నిర్వహించిన సమావేశానికి హాజరుకాని నాయకులు

జహీరాబాద్, డిసెంబర్ 12: పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ముసాయిదా, పోలింగ్ స్టేషన్లు, వార్డుల జాబితాపై అభ్యంతరాల స్వీకరణపై అధికారులు చేపట్టిన సమీక్షకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరుకాలేదు. గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జహీరాబాద్, న్యాల్‌కల్ మండల కేంద్రాల్లోని మండల పరిషత్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. జహీరాబాద్ మండలంలోని 22 గ్రామ పంచాయతీలోని 210 పోలింగ్‌స్టేషన్లు, వార్డులు, న్యాల్‌కల్ మండలంలోని 38 గ్రామ పంచాయతీలోని 336 పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు తెలిపారు. నాయకులు ఎవరూ రాకపోవడంతో అధికారులు నిరుత్సాహపడ్డారు. ఈ నెల 17న తుది జాబితాలను ప్రచురిస్తామని ఆయా మండలాల అధికారులు మహేందర్‌రెడ్డి, రాజశేఖర్ పేర్కొన్నారు.

కందిలో..

కంది, డిసెంబర్ 12: వచ్చే పంచాయతీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ స్టేషన్ల నిర్వహణపై గురువారం కంది ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. వార్డుల వారీగా ఉన్న పోలింగ్ కేంద్రాలపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్, నాయకులు కోరారు. కంది మండలంలోని 212 వార్డులకు 212 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చిమ్నాపూర్ తండాలో కొత్త పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరగా తండాలో 50 మంది ఓటర్లే ఉన్నారు కాబట్టి పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసే వీలులేదని ఎంపీడీఓ తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నాయకులు సహకరించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మోతిలాల్ నాయక్, బీజేపీ నాయకులు సదానందచారి, సీపీఐ నాయకులు ఖాజా, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

పరిశ్రమల భాగస్వామ్యం అభినందనీయం

పాఠశాల మైదానాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రోజాబాల్ రెడ్డి, పరిశ్రమ ప్రతినిధులు

బొల్లారం డిసెంబర్ 12: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం అభినందనీయమని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు పారిశ్రామిక వాడకు చెందిన థర్మల్ సిస్టమ్స్ పరిశ్రమ ఆధ్వర్యంలో రూ.10 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటుచేసిన సౌకర్యాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలో మైదానాన్ని చదును చేసి విద్యార్థులకు అవసరమైన వసతులు, సౌకర్యాలు సమకూర్చడం గొప్ప విషయం అన్నారు. పాఠశాలకు సంపు ఏర్పాటు చేయాలని పరిశ్రమ ప్రతినిధులను విజ్ఞప్తి చేశారు. పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఇండస్ట్రియల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆనంద్‌రావు మాట్లాడుతూ... పాఠశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. టాయిలెట్ల మరమ్మతులకు అమెజాన్ పరిశ్రమ సహకారంతో పూర్తి చేయిస్తామన్నారు. క్రీడా మైదానం, పరికరాలు, ఫర్నిచర్ వంటివి పరిశ్రమ యాజమాన్యంతో కలిసి పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రతినిధులను చైర్‌పర్సన్, ప్రిన్సిపాల్‌తో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కిన చైన్ స్నాచర్

పటాన్‌చెరు, డిసెంబర్ 12: ఇంద్రేశం గ్రామంలో స్కూల్‌నుంచి తన నాలుగేళ్ల కూతురిని తీసుకొని వస్తున్న మహిళ మెడలోని బంగారు చైన్‌ను లాక్కొని పారిపోయిన వ్యక్తిని పటాన్‌చెరు పోలీసులు పట్టుకున్నారు. గురువారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ క్రైం సీఐ రాజు వివరాలు వెల్లడించారు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామంలో ఈ నెల 3న గొల్ల భాగ్యమ్మ తన కూతురును తీసుకొని స్కూల్‌నుంచి ఇంటికి వస్తున్నది. ఈ సమయంలో బైక్‌పై అతివేగంగా వచ్చిన వ్యక్తి ఆమె మెడలోని గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. ఆ పోలికలతో గురువారం ఇస్నాపూర్‌లో అనుమానాస్పదంగా మరో దొంగతనం చేసేందుకు యత్నిస్తున్న బుద్ధం దత్తురాజ్(24)ను అదుపులోకి తీసుకొని విచారించారు. ఇంద్రేశంలో చైన్ స్నాచింగ్ చేసినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు నిందితుడి వద్ద మూడు తులాల బంగారు పుస్తెలతాడును, బైక్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు పంపారు. కోర్టు నిందితుడికి రిమాండ్ విధించింది. ఈ సమావేశంలో ఎస్ఐలు కోటేశ్వర్‌రావు, క్రైం ఎస్ఐ రజాక్, సిబ్బంది పాల్గొన్నారు.

చేసిన పనులే గుర్తింపునిస్తాయి

ఎంఈవో శంకర్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో రమేశ్‌బాబు

కల్హేర్, డిసెంబర్ 12: చేసిన పనులతో మంచి గుర్తింపు వస్తుందని ఎంపీడీవో రమేశ్‌బాబు అన్నారు. గురువారం కల్హేర్ మండల విద్యాధికారిగా తొమ్మిది సంవత్సరాలు విధులు నిర్వహించి బదిలీ కావడంతో రైతు వేదికలో ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్ అధ్యక్షతన ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి ఎంఈవో శంకర్ ఎంతోగానో కృషి చేశారన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న సమయంలో పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకొని అందరి మన్ననలు పొందారన్నారు. ఎంఈవో శంకర్‌ను ఎంపీడీవో, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూపరింటెండెంట్ సంగ్రామ్, ఆయా సంఘాల నాయకులు, ఎహెచ్‌లు గుండు లక్ష్మన్, సురేశ్, సుధాకర్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశ గడువు పెంపు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 12: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో 2024-25 సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్ణీత అపరాధ రుసుముతో ఈ నెల 16 వరకు గడువు పొడిగించినట్టు జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటేశ్వర్లు గురువారం ప్రకటనలో స్పష్టం చేశారు. పదో తరగతి ప్రవేశానికి సంబంధించి ఓసీ పురుషులకు రూ.1400, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పురుషులు, మహిళలందరికీ రూ.1,000, అందరికీ ప్రాస్పెక్టస్ ఖరీదు రూ.150, ఆన్‌లైన్ చార్జీలు అదనం, అపరాధ రుసుము అందరికీ రూ.100 ఉంటుందని వివరించారు. ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి సంబంధించి ఓసీ పురుషులకు రూ.1,500, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పురుషులు, మహిళలందరికీ రూ.1,200, అందరికీ ప్రాస్పెక్టస్ ఖరీదు రూ.300, ఆన్‌లైన్ చార్జీలు అదనం, అపరాధ రుసుము కూడా అందరికీ రూ.200 ఉంటుందని పేర్కొన్నారు. నిర్ణీత ఫీజు కంటే ఎక్కువ వసూలు చేస్తే సంబంధిత అధ్యయన కేంద్రాన్ని రద్దు చేస్తామని హెచ్చరించారు. అభ్యాసకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ వెంకటస్వామి(80084 03635)ను సంప్రదించాలని సూచించారు.

వీరభద్రుడి ఆదాయం రూ.15.35 లక్షలు

గుమ్మడిదల, డిసెంబర్ 12: ప్రసిద్ధ శైవ క్షేత్రమైన బొంతపల్లి వీరభద్రస్వామి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. గురువారం మండలంలోని బొంతపల్లి - వీరన్నగూడెంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో 70 రోజులు భక్తులు సమర్పించుకున్న కానుకలు, ముడుపులను లెక్కించారు. దీనికి జిల్లా డివిజన్ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఈవో శశిధర్‌గుప్తా సమక్షంలో హుండీల ఆదాయాన్ని లెక్కించగా రూ.15 లక్షల 35 వేల 63 వచ్చినట్లు తెలిపారు. అన్నప్రసాదానికి రూ.82 వేల 279 వచ్చినట్లు తెలిపారు. ఈ ఆదాయాన్ని భ్రమరాంబ సేవాసమితి సభ్యులు లెక్కించారు. ఈ లెక్కింపులో జూనియర్ అసిస్టెంట్ సోమయ్య, నాయకులు మద్ది ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పొన్నబోయిన వేణు, పూర్వ ధర్మకర్తలు లక్ష్మీనారాయణ, భక్తులు కుమార్, యాదగిరి పాల్గొన్నారు.

కురుమల ఆత్మగౌరవ సభకు తరలిరావాలి

మాట్లాడుతున్న సంఘం నాయకులు

హత్నూర, డిసెంబర్ 12: హైదరాబాద్‌లో శనివారం నిర్వహించే కురుమ సంఘం ఆత్మగౌరవ సభకు తరలిరావాలని ఆ సంఘం నాయకులు కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో కురుమ సంఘం భవనం, హాస్టల్ నిర్మాణం పూర్తికావడంతో వాటి ప్రారంభోత్సవంతోపాటు ఆత్మగౌరవ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కిష్టయ్య, శ్రీశైలం, పాండు, కృష్ణ, నారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

హత్నూర, డిసెంబర్ 12: మండలంలోని పల్పనూర్‌లో నేటినుంచి 15 వరకు శివపంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 13న గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్ట, జలాధివాసము, 14న గణపతిపూజ, పుణ్యాహవచనము, ధ్వజదేవతల మహామంత్ర హోమములు, రుద్రచండీహోమాలు, 15న యంత్రప్రతిష్ఠ, విగ్రహ, ధ్వజస్తంభ, శిఖర ప్రాణ ప్రతిష్ఠతో పాటు పార్వతీ రాజరాజేశ్వరుల కల్యాణోత్సవం తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని మూర్తిమే ఘనారెడ్డి, హరీశ్‌బాబు కోరారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఆలుగడ్డ పంటను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రహుల్ విశ్వకర్మ

జహీరాబాద్, డిసెంబర్ 12: అల్లం, ఆలుగడ్డ సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని సంగుపేట్ డాట్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రహుల్ విశ్వకర్మ అన్నారు. గురువారం మండలంలోని రంజోల్ గ్రామంలో రైతులు సాగు చేసిన ఆలుగడ్డ, అల్లం పంటలను పరిశీలించారు. ఆయా పంటలకు నీటితడులు, ఎరువుల ఆవశ్యకత, ఆశించే తెగుళ్లు, చీడపురుగుల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్‌కుమార్, డాట్ సెంటర్‌వైపీ 1 శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

గుమ్మడిదల, డిసెంబర్ 12: ఆధ్యాత్మికతతోనే మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి గురుమాధవానంద సరస్వతిస్వామి ప్రవచించారు. గురువారం మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా భక్తులు స్వామివారికి పాదపూజ చేశారు. భక్తులకు ఆయన ఆశీర్వచనాలు అందజేశారు.

ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన

బొల్లారం డిసెంబర్ 12: లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వేను పారదర్శకంగా చేపట్టామని మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి, కమిషనర్ మంగతాయారు అన్నారు. ప్రజాపాలన సభల్లో అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ సర్వేను గురువారం స్థానిక బీరప్పబస్తీలో ప్రారంభించారు. మున్సిపల్ వ్యాప్తంగా అందిన 6,567 దరఖాస్తులపై ఇంటింటికీ వెళ్లి ఖచ్చితమైన వివరాలను దరఖాస్తుదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను ఈ నెలఖారు పూర్తిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్, ఆర్వో నర్సింలు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

నవాబుపేటలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

హత్నూర, డిసెంబర్ 12: ఎల్ఐసీ సౌజన్యంతో హత్నూర మండలం నవాబుపేటలో గురువారం మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. గ్రామంలో అత్యధిక కుటుంబాలు ఎల్ఐసీ పాలసీలు తీసుకోవడంతో ప్రోత్సాహకంగా ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించేందుకు రూ.2లక్షల30 వేలతో మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటుచేసినట్లు సీనియర్ మేనేజర్ ప్రేమ తెలిపారు. గ్రామంలో అత్యధికంగా పాలసీలు చేయించిన ఎల్ఐసీ ఏజెంట్ యాదగిరిని అభినందించారు. అనంతరం ఎల్ఐసీ పాలసీల ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ అసిస్టెంట్ మేనేజర్ పూర్ణచందర్ రాజ్, గ్రామ ప్రత్యేక అధికారి అరవింద్, కార్యదర్శి రాకేశ్‌కుమార్, మాజీసర్పంచ్ మల్లేశం, నాయకులు శ్రీనివాసరెడ్డి, బుచ్చిరెడ్డి, నవీన్‌గౌడ్, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

నిజాంపేట్, డిసెంబర్ 12: కార్యకర్తలు, నాయకుల కుటుంబాలకు బీఆర్ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని నారాయణ ఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భుపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జంబికుంట గ్రామానికి చెందిన పట్లోళ్ల విఠల్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా గురువారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట నారాయణఖేడ్ మండల మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి, రవీందర్‌నాయక్, మాజీ సర్పం చ్ సాయిలు, మాజీ ఎంపీటీసీ అంబన్న, ఆంజనేయులు సేట్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు దుర్గారెడ్డి, నగేశ్ సేట్, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, మానిక్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రాజుపాటిల్, బసవరాజ్ తదితరులు ఉన్నారు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL MEGISTEATE OF FIRST CLASS : ZAHEERABAD O.S.NO. 62 OF 2023

BETWEEN:
Vadla Jagadeeshwar & other ...Plaintiffs
AND
The Tahasildar, Nyalkal Mandal
All Concerned & another ...Defendants
To
All Concerned

Please take notice that the above named plaintiffs filed above suit for Declaration of Plaintiffs as legal heir of deceased Father and Mother of the plaintiff. If any person or persons having any objections over the relief clamed in the above suit are, do hereby required to appear in person or through an Advocate before this Hon'ble Court on 22-01-2025 at 10.30 A.M. either any person or through your Pleader and to file your written statement or objections, if any failing which the matter will be decided in your own absence.

//BY ORDER OF COURT//
P. MADHUSUDAN REDDY,
Advocate
Flat No. 502, Chandan Tara Residency, D.D. Colony, Amberpet, Hyderabad-500 013, **Ph: 9866415506.**